

- శీలంశెట్టి రమాదేవి

చూసుకోపోగా రాయన. ఆఫీసు నుంచి బయలుదేరేసరికి అయిదున్నర అయింది. జీప్‌లో పది నిమిషాలకే వాళ్ళ ఇల్లు చేరుకొన్నారు.

హాల్లో సోఫా వంక చూపుతూ, "కూర్చో, అమ్మాయి వస్తుంది" అన్నా రాయన.

సోఫాలో కూలబడ్డాడు చలపతి. మరో అర గంట తరవాత ఆయన వెంబడే వచ్చి నించుంది రెహానా.

"పేరు రెహానా" అన్నా రాయన.

"నమస్తే!" అంది రెహానా చలపతి కళ్ళలోకి చూస్తూ. చలపతి ఆమె అందం చూసి నిశ్చేష్టు డయాడు. తెల్లగా, అజంతా విగ్రహం లాంటి శరీరపు ఒంపులతో, పెద్ద కళ్ళూ, చక్కని ముక్కూ, ఎర్రని పెదాలతో మెరిసిపోతూం దామె.

తడబడుతూ ప్రతినమస్కారం చేశాడు. ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుని చేతిలోని పుస్తకాలు మధ్యలో ఉన్న స్టూల్ మీద ఉంచింది.

లెక్కల పుస్తకం తీసి ఓ సారి చూసి, "మీకు కష్టంగా ఉన్న ఛాప్టర్ లేవో చెప్పండి. వరసగా చేసేద్దాం" అన్నాడు తల ఎంచుకొనే. ఆమె కళ్ళలోకి చూడా లంటే భయంగా ఉంది, ఎక్కడ తడబడి పోతాడో నని.

ఆమె చెప్పిన ఛాప్టర్లన్నీ గుర్తు పెట్టుకొని వరసగా బుక్ వర్క్, ప్రాబ్లమ్స్ ఒకటొకటిగా వివరిస్తూ ఆమెతోనే చేయింపసాగాడు.

గంటసేపలా గడిచేసరికి, "ఇక లెక్కలు చాలండీ, మాస్టారూ, ఈవేళకి! ఇంగ్లీష్ చెప్పండి" అంది నెమ్మదిగా.

"సరే ... సరే!" అన్నాడు చలపతి తొందరగా. అతని తొందర చూస్తే ఆమెకు నవ్వు వస్తోంది.

ఇంగ్లీష్ పాఠం తీసి తనకు తోచి నట్లుగా ఎక్స్‌ప్లెయిన్ చేస్తూ చదివాడు. అదో అరగంటసేపు పట్టింది.

"ఇక నే వెళతాను. రేపూ ఇదే టైముకు వస్తాను" అన్నాడు లేచి నించుంటూ.

"ఉండండి! 'చాయ్' తీసుకొస్తాను" అంది రెహానా తనూ లేస్తూ.

"అబ్బే! ఎందుకండీ? వద్దు ..." మొగమాటంతో అన్నాడు చలపతి.

"భలేవారే! చాయ్ తాగకుండా వెళ్ళ డానికి వీలులేదు" అంటూ నవ్వి లోపలకు పరుగెత్తింది. నవ్వుతున్నప్పుడు మరింత అందంగా మారిన ఆమె రూపం చూచి ఉత్తేజితుడయిపోయా డతను.

అయిదు నిమిషాల్లో చిన్న ట్రేలో కప్పునిండా టీ తీసుకొచ్చి అతని ముందు ఉంచింది.

"మరి మీరో?" కప్పు అందు కుంటూ అడిగాడు చలపతి.

"నేను మీ రాక ముందే తాగే శాను."

తాగిన తరవాత కప్పు, ట్రే తీసుకుని ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

చలపతి బయటికి వచ్చేస్తుంటే గార్డెన్‌లో కుర్చీలో కూర్చుని ఇంగ్లీష్ మాగజైన్ చదువుతూ తాసిల్దారుగారు కనిపించారు.

"ఏమోయ్? ఎలా ఉంది మీ స్టూడెంట్? పాసవుతుం దంటావా?"

"ఈజీగా పాసవుతుందండీ! మీ రన్నంత 'వీక్'గా లేదు లెక్కల్లో."

"అఫ్ కోర్స్ ... అఫ్ కోర్స్. తెలివి గలదే కాని ... ప్రాపర్ గైడెన్స్ కావాలి. అంతే." నవ్వుతూ అన్నా రాయన.

చలపతి ఇంటి కొచ్చేశాడు.

ఆ రాత్రంతా అతనికి నిద్ర పట్టలేదు. రెహానా రూపమే క్షణ క్షణానికీ కన్పిస్తూ కనబడుతూంది. ఎంత ప్రయత్నించినా మనసులోంచి ఆమె తొలగడం లేదు. తన మీద తనకే కోపం వచ్చింది చలపతికి. ఇంత దిగజారిపోయా డేమిటి తను? అందమయిన అమ్మాయితో పరిచయ మైనంత మాత్రాన మన సిలా అల్లక ల్లోలమయి పోవడమేమిటి? అయినా, రెహానా అంతస్తేమిటి? తన అంత స్తేమిటి? ఆమె ఓ ఆఫీసరుగారమ్మాయి. తనేమో ఉద్యోగం కోసం వెదుకుతూన్న మిడిల్ క్లాస్ మనిషి. ఆమెదో మతం, తన దో మతం. తెల్లగా దేవతలా ఉన్న రూపం ఆమెది. ఎండలో, వానలో తిరిగి నల్లగా, మోటుగా తయారయిన మనిషి తను.

మరునాడు సాయంత్రం ట్యూషన్‌కి వెళ్ళినప్పుడు ధైర్యంగా ఆమెతో మాట్లాడడం, పాఠాలు చెప్పడం చేయగలిగాడు చలపతి.

## అంతరంగం

ఏ దేశంలోనైనా మహా కవుల రచనలలో కనిపించేది, దేశభక్తి, జాతీయ దృక్పథం కాదు. అంతర్జాతీయ దృక్పథం, విశ్వ జనీనత.

—లాంగ్‌ఫెలో

రెహానా కొద్దిగా ఆశ్చర్యపోయింది అతనిలోని మార్పుని చూసి. తనని చూసి తడబడడం, ఖంగారుగా పాఠాలు చెప్పడం చేసిన పెద్దమనిషి ఒక్క రోజులో ధైర్యంగా, ఎంతో అనుభవం ఉన్న వాడిలా మాట్లాడడం ఎలా నేర్చు కొన్నాడో ఆమెకు అర్థం కాలేదు.

వారం రోజులు అలాగే సీరియస్‌గా గడిచిపోయినాయి. రెహానా కది ఏమీ నచ్చలేదు. మరో మాట మాట్లాడ కుండా కేవలం పాఠాలు చెప్పుకుపోవడమేనా ఈ మనిషి తత్త్వం? ఈ రోజు ఎలాగయినా సరే, అతన్ని కబుర్ల లోకి దింపేయాలని నిశ్చయించుకొంది.

రాగానే ఇంగ్లీష్ పుస్తకం అందు కొన్నాడు చలపతి.

"ది ఆర్ట్ ఆఫ్ పొలిటికల్ క్లైంబింగ్."

"ఒక చిన్న విషయం ..." అంటూ అడ్డు తగిలింది రెహానా.

"ఏమి టది?"

"పుస్తకాల పురుగులాగా ఎప్పుడూ చదవటం కూడా మంచిది కాదన్నారండీ మా లెక్చరర్ ఒకామె!" చిన్నగా నవ్వుతూ అం దామె.

"అది చదివేవాళ్ళ గురించి అని ఉంటుంది. మీ గురించి కాదేమో!" హాస్యంగా అన్నాడు చలపతి.

"అంటే, నేను బాగా చదవటంలే దంటారా?" చిరుకోపం అభినయిస్తూ అంది.

"నే ననలేదుగా అలా అని?"

"పోనీండి. వాద మెందుగ్గానీ... ఈ చీర ఎలా ఉంది?" పైటచెంగు బిగుతుగా లాగి అతనికి చూపుతూ అడిగింది.

చలపతి ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"చాలా బాగుంది గానీ ... ముందు పాఠం..."

"ఎప్పుడూ 'పాఠం, పాఠం' అంటా రేమండీ! ఈవేళ ఒక్క రోజు చెప్పక పోయినంత మాత్రాన మునిగిపోయిం దేమీ లేదు... ఈ చీర నిన్నే కొన్నాను. ఎంతో తెలుసా?"

"నాకేం తెలుసు?"

"రెండు వందల పాతిక."

"అంత ఖరీదా? !"

"అవును! ఎందుకు కొన్నానో తెలుసా?"

చలపతి కామె వ్యవహారం ఏమీ నచ్చలేదు. తాసిల్దారు గారు ఈ మాటలు వింటే ఏమనుకొంటారు? 'చదువు చెప్ప మంటే అమ్మాయి కట్టుకున్న చీర గురించి చెపుతున్నాడు వీడు' అనుకొం టారు.

"బహుశా కట్టుకోవడానికే కొన్నా రనుకొంటాను." చిలిపిగా అన్నాడు చలపతి.

కిలకిల నవ్వేసింది రెహానా.

"రోజులాగే ఇంకెందుకు? నే నడిగేది అదికాదు ... ఈ వేళ నా పుట్టిన రోజని నాన్నగారు కొనిపెట్టారు."

"ఓహో! సంగతి! ఇంతకూ ఈ వేళ మీ పుట్టిన రోజన్న మాట! మరి ఆ పండుగ జరుపుకోలేదా?"

"ఆర్భాటంగా చేయడం నాన్నగారి కిష్టం ఉండదు. అంతా సింపుల్. తల్లి, బట్ట లేసుకోవడం, మమ్మా తయారుచేసే మిఠాయి స్వీట్లూ, హాట్లూ తినడం — ఇంతే ప్రోగ్రామ్."

"సంగతి. ఏది ఏమైనా మీరు ఇలాంటి అదృష్టమయిన పుట్టిన రోజులు ఓ వంద జరుపుకోవాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఇక పాఠం మొదలెడదామా?"

"మీ రా పాఠం గొడవ వదిలేట్లు లేరే! ఈ వేళ అన్నీ బంద్!"

"ఎందుకని?"

"నేను ఇప్పుడు ఫస్ట్ షో సినిమాకి వెళుతున్నాను."

"ఓహో! అలాగయితే చెప్పండి మరి."

"అప్పుడేనా? నాన్నగారు జీపు పంపిస్తా నన్నారు. ఒక్కర్తెనూ ఎలా వెళ్ళడమా అని మా క్లాస్‌మేట్ సుభద్రని రమ్మన్నాను. అది ఇంతవరకూ రానేలేదు." నవ్వుతూ అంది రెహానా.

చలపతికి ఆమె ఇదంతా తన కెందుకు చెపుతూందో లీలగా అర్థమయింది.

"మరి నే వెళతాను" అన్నాడు లేచి నించుని.

"అయ్యయ్యో! అంత తొందరేం? నేను వెళ్ళేది బృందావన్ టాకీస్‌కేగదండీ? దగ్గరే! ఇంకా చాలా టైముంది. ఈ లోగా ... 'స్వీట్' తీసుకోరూ?" అంటూ లోపలకు నడిచింది.

గత్యంతరం లేక కూర్చుండిపోయాడు చలపతి.

రెండు ప్లేట్ల నిండా స్వీట్లూ, హాటూ తీసుకొచ్చి అతని ముందు ఉంచిం దామె.


"ఇన్నా?" అడిగాడు చలపతి.

"ఇంకా చాలా ఇద్దును ... మీరు గాభరాపడకపోతే" గట్టిగా నవ్వేస్తూ అంది. చలపతికి మాట్లాడవానికే భయంగా ఉంది. త్వరత్వరగా తినడం ముగించి, టీ తాగి బయట పడ్డాడు.

"పాఠం చెప్పలేదని దిగులు పెట్టుకోకండి! రేపు రెండు చెబుదురుగాని." గేటువరకూ వచ్చి నవ్వుతూ అంది మెల్లిగా.

రాను రాను అతనితో చనువు పెంచుకొంటూ వచ్చింది రెహానా.

పాఠాలకంటే ఏవేవో మాటలు ఎక్కువ సేపు చెప్పడం అలవాటయి పోయింది. ఒకో రోజు అసలు పాఠం చెప్పనిచ్చేది కాదు.




"నిన్న రిలీజయిన హిందీ సినిమా చూశారా?" అనడిగేది.

"లేదు" అనంటే— "ఎందుకని? హిందీ రాదనా? నన్ను తీసుకెళ్ళండి... ట్రాన్స్‌లేట్ చేసి చెబుతుంటాను" అనేది నవ్వుతూ.

చలపతి ఏం మాట్లాడాలో తెలియక ఊరుకుండిపోయేవాడు.

నెల రోజులు అలా గడిచిపోయినాయి. తనకు తెలీకుండానే ఆమెను ఒక్క రోజయినా చూడకుండా ఉండలేని స్థితికి వచ్చేశాడు చలపతి.

సాయంత్రం ఎప్పుడవుతుందా, ఎప్పుడు ఆమె కనబడుతుందా అని మనసులో ఆరాటంగా ఉండేది.

ఓ రోజు మధ్యాహ్నం పోస్టులో బొంబాయిలోని ఓ కంపెనీ నుంచి అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చింది. ఆ ఉద్యోగానికి అప్లై చేసి చాలాకాల మయిపోయింది. ఇంటర్‌వ్యూ కూడా అయింది.

సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు చలపతి. ఆ రాత్రికే బయలుదేరడానికి నిశ్చయించుకొన్నాడు. వెంటనే తాలూకా ఆఫీసుకి వెళ్ళి తాసిల్దారు గారికీ సంగతి తెలియజేశాడు.

"కంగ్రాచ్యులేషన్స్! చాలా మంచి కంపెనీ అది. వెంటనే చేరిపోవడం మంచిది" అన్నా రాయన.

"సారీ, సార్. రెహానా ఎగ్జామిన్స్ వరకూ ఉండనందుకు" అన్నాడు చలపతి.

"దట్సాల్‌రైట్ — ఈ నెల రోజుల్లోనే చాలా ఇంప్రూవ్ అయింది రెహానా! సాయంత్రం ఓ సారి ఇంటికొస్తావా?"

"అలాగే నండీ."

ఫ్రెండ్సందరితో తన ఉద్యోగం గురించి చాటింపు వేసి సాయంత్రం చీకటి పడుతూండగా తాసిల్దారు గారి ఇల్లు చేరుకొన్నాడు చలపతి.

సోఫాలో కూర్చుని, "రెహానా" అంటూ పిలిచాడు.

"వస్తున్నానండీ! ఒక్క నిమిషం." లోపలనుంచే అంది రెహానా.

పది నిమిషాల తరవాత కర్టెన్ తొలగించుకొని వచ్చిందామె.

ఆమెను చూస్తూనే ఉలిక్కిపడ్డాడు చలపతి. వాడిపోయిన ముఖం, దిగులు కమ్ముకొన్న కళ్ళు — జబ్బుపడి లేచిన మనిషిలా కనబడుతూంది. అతని కెదురుగా కూర్చుని తల వంచుకొని కిందకు చూడసాగింది.

"ఈ వేళ మంచి పాఠాలు లేవు" అన్నాడు చలపతి నవ్వు తెచ్చిపెట్టుకొంటూ.

తల ఎత్తి అతని కళ్ళలోకి చూసింది రెహానా.

"నాన్నగారు చెప్పారు" అంది బాధగా.

చలపతికి ఆమె కనిపించటం లేదు. కళ్ళ నిండుగా నీళ్ళు కమ్ముసినాయి. కర్చీఫ్ తీసి ముఖం తుడిచేసుకొన్నాడు.

కొద్ది క్షణాలు మౌనంగా గడిచిపోయినాయి. ఇకనుంచీ రెహానా తనకు కనిపించదన్న నిజం గుండెల్ని కలిచివేస్తూంది.

"ఆఖరి రోజు! కాసేపు సరదాగా మాట్లాడకూడదూ?" అన్నాడు గొంతు పెగల్చుకొని.

చివాలున తల ఎత్తి అతని వంక చూసింది రెహానా! ఆమె కళ్ళ నిండా నీళ్ళు నిలిచి ఉన్నాయి.

"నేను ... వెళతాను ... ఇక!" అన్నాడు మరో వేపు చూపు మరలుస్తూ.

"ఒక్క నిమిషం ... చాయ్ తీసుకొస్తాను..." నెమ్మదిగా నడిచి లోపలకు వెళ్ళింది. అయిదు నిమిషాల తరవాత ఓ కప్పు నిండా టీ తీసుకొచ్చి అతని ముందు ఉంచింది.

తాగి కప్పు 'టీపాయ్' మీద ఉంచాడు చలపతి.

"మీ చెయ్యి ఇలా ఇవ్వండి" అంది నెమ్మదిగా.

"జ్యోతిషం చెబుతావా?" అన్నాడు నవ్వి చేయి జాపుతూ.

గుప్పిట్లోంచి మల్లెమొగ్గలతో చుట్టి తయారు చేసిన ఓ ఉంగరం తీసి అతని వేలికి తొడిగిం దామె.

"రెహానా! ఇలా చేయచ్చా? దీని అర్థం ఏమిటో నీకు తెలుసా?" అన్నాడు చలపతి భయంగా.

రెహానా జవాబు చెప్పలేదు. 'నమస్తే' అని చేతులు జోడించి లోపలకు వెళ్ళిపోయింది. కొద్దిసేపటి తరవాత తాసిల్దారు గారు వచ్చి ఓ కవరు చలపతి కందించారు.

"ఈ నెల రోజులకీ ఫీజిది" అన్నారు నవ్వుతూ.

ఆ రాత్రే చలపతి ఆ ఊరు వదిలేశాడు. సంవత్సరం తరవాత తిరిగి ఆ ఊరు వచ్చినప్పుడు ఆ తాసిల్దారు గురించి వాకబు చేశా డతను.

ఆయన భార్యకు అనారోగ్యంమూలాన ఆరు నెలలు సెలవు పెట్టి ఊటీ వెళ్ళారట. ఆ తరవాత ఎక్కడికి ట్రాన్స్‌ఫ రయిందో తెలియదు.

బాంక్ చేరుకొన్నాడు చలపతి. అయిదవడానికి మరో అయిదు నిమిషాలు మాత్ర ముంది. గేటు దగ్గరే నించుంటే ఏ క్షణాన్నయినా రెహానా బయటకు రావచ్చు. నిలబడి సిగరెట్ వెలిగించాడు. ఒక్కొక్కరే బాంక్ ఉద్యోగులు బయటి కొస్తున్నారు. మరి కొంచెంసేపట్లో దూరంగా చెట్ల మధ్య నుంచి రెహానా మరో అమ్మాయితో కలిసి వస్తూ కనిపించింది. గుండెలు విపరీతమయిన వేగంతో కొట్టుకో సాగింది చలపతికి. మనసంతా ఓ విచిత్రమైన ఆనందంతో నిండిపోయింది. ఆవేశంగా, తన్మయత్వంతో ఆమె వంకే చూస్తూండిపోయాడు. పరిసరాలుకూడా గుర్తులేకుండా పోయినాయి. తనూ, రెహానా — అంతే! ఇంక ఏమీ కనిపించటం లేదు. దగ్గరగా వచ్చేసింది రెహానా! ఇంకొద్ది క్షణాల్లో తనను చూస్తుంది. హఠాత్తుగా అతనిలో ఆలోచనలు విద్యుత్తులా ప్రవహించినాయి.

'ప్రతి మనిషికీ కొన్ని తీయని అనుభూతులూ, అనుభవాలూ ఉంటాయి. రెహానాకూ, తనకూ తాము గడిపిన నెల రోజులూ తీయని అనుభూతి. జీవితమంతా ఆ అనుభూతి ఇద్దరిలోనూ కదులుతూనే ఉంటుంది. తనిప్పుడు రెహానాను కలుసుకుంటే, ఇద్దరూ సంతోషిస్తారు. మాట్లాడుకొంటారు. ఒకరి గురించి ఒకరు తెలుసుకొంటారు. మరునాడు తనెలాగూ బొంబాయి వెళ్ళిపోతాడు. అంతే! అక్కడితో ఇద్దరిలోనూ ఆ తీయని అనుభూతి నశించిపోతుంది. ఇద్దరకూ బాంక్ దగ్గర కలుసుకొని మాట్లాడిన దృశ్యమే గుర్తుకొస్తుంది. కాని, తన వేలికి ఆమె కన్నీళ్ళతో మల్లెమొగ్గల ఉంగరం తొడిగిన దృశ్యం గుర్తుకి రాదు. అందుచేత ఆ అనుభూతికి తను దూరమయినా, రెహానాని దూరం చేయకూడదు ...'

చటుక్కున వెనక్కు తిరిగి వేగంగా అడుగులు వేస్తూ జనసమూహంతో కలిసిపోయాడు చలపతి. ★